సాక్షి నిర్మల్

బుధవారం । 18 । జనవరి । 2023



వడివడిగా ఎత్తిపోతలు

లోకేశ్వరం మండలం పిప్రి గోదావరి సమీపంలో చేపట్టిన ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌కు సాగునీరు అందిస్తామని అధికారులు చెబుతున్నారు. 9లో▸



సందడిగా ఖండేవ్ జాతర

నార్నూర్ మండలంలో ఖండేవ్ జాతర కొనసాగుతోంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 / 16.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రి చలిప్రభావం తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'డబుల్‌బెడ్రూం హామీ నెరవేర్చాలి'



మహాధర్నాలో నాయకులు, కార్యకర్తలు

భైంసాటౌన్: అర్హులకు డబుల్‌బెడ్రూంలు మంజూరు చేస్తామన్న హామీని సీఎం కేసీఆర్ వెంటనే నెరవేర్చాలని బీజేపీ ముధోల్ నియోజకవర్గ నాయకుడు భోస్లే మోహన్‌రావు పటేల్ డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం భైంసాలో మహాధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక సందేశ్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణలో బహిరంగసభ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఆర్ అండ్‌బీ విశ్రాంతిభవనం చౌరస్తా వరకు ర్యాలీగా చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేద ప్రజలకు డబుల్‌బెడ్రూంలు ఇస్తామని మాయమాటలు చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఆవాస్ యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు గాలి రవి, దిలీప్, సుభాష్ తదితరులున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మైనార్టీ యువత (క్రైస్తవులు మినహా) ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి తుకారాం ఓ ప్రకటనలో తెలిపారు. షార్ట్‌టర్మ్ క్రాష్ ప్రొఫెషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సోలార్‌ప్యానెల్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుల శిక్షణను ఖానాపూర్ పట్టణంలోని రైస్ ఇనిస్టిట్యూట్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2లక్షలకు మించరాదని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 25లోపు జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాధాకృష్ణ ఆలయానికి నిధులు మంజూరు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో గల రాధాకృష్ణ ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. మంగళవారం భాగ్యనగర్ కాలనీని సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు తెలిపారు.

జాతరకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వానపత్రం ఇస్తున్న సభ్యులు

ఖానాపూర్: ఈనెల 24న పట్టణంలో నిర్వహించనున్న సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పలువురు ప్రముఖులను జిల్లా కేంద్రంలో మంగళవారం వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితోపాటు కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ, అడిషనల్ కలెక్టర్లు హేమంత్‌బోర్కడే, రాంబాబు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నిర్మల్ ఆర్డీవో స్రవంతి, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ చిలుక రమణను కలిశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ప్రదీప్, సహ కోశాధికారి కే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆర్ రాజశేఖర్ తదితరులన్నారు.

ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్‌గా భైంసా

భైంసాటౌన్: భైంసా పట్టణాన్ని పూర్తి ఓడీఎఫ్‌ప్లస్‌ప్లస్‌గా ప్రకటిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణలో భాగంగా పట్టణాన్ని బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చామని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వ్యాపార, సముదాయాల్లో ప్రజలకు మరుగుదొడ్ల వసతి కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.



ప్లాన్ పరేషాన్..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న పంటపొలాలు నిర్మల్ పట్టణానికి ఉత్తరాన ఉన్నాయి. వీటి మధ్య నుంచే కొత్తగా 100 ఫీట్ల రహదారి నిర్మించాలని మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌లో ప్రతిపాదించడంపై స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగల్‌చెరువు కింద ఉన్న ఈ భూముల్లో నుంచి కాకుండా ఇదివరకే చెరువు కట్టపై నుంచి ఉన్న రోడ్డును వెడల్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- డ్రాఫ్ట్‌పై పలుచోట్ల అసంతృప్తి
- మాస్టర్‌ప్లాన్ మార్చాలని ఒత్తిడి
- రోడ్లు, పరిశ్రమలపై అభ్యంతరం
- రైతులు, యజమానుల నిరసన
- పరిశీలిస్తామన్న అధికారులు



నిరసన తెలుపుతున్న రైతులు

నిర్మల్: కామారెడ్డి, జగిత్యాల తర్వాత నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్ చిచ్చుపెట్టనుందా..!? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. డ్రాఫ్ట్‌లో ప్రతిపాదించిన రోడ్లు, పరిశ్రమల జోన్లపై స్థానిక రైతులు, భూయజమానుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం పలువురు రైతులు, యజమానులు మున్సిపాలిటీకి వచ్చి, తమ భూముల్లో నుంచి రోడ్డు వేయొద్దని విన్నవించారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపడతామన్నారు. అయితే అధికారులు ఇది మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ మాత్రమేనని ఇందులోని ప్రతిపాదనలపై అభ్యంతరాలు తీసుకుంటున్నామని, వాటిని పరిశీలించాకే ఫైనల్ చేస్తామని చెబుతున్నారు.

పంటపొలాల్లో..

సెమీ అర్బన్ మున్సిపాల్టీలుగా ఉన్న నిర్మల్ లాంటి బల్దియాల్లో ఇప్పటికీ చుట్టూ పంటపొలాలున్నాయి. జిల్లాకేంద్రాలుగా ఎదిగినా శివారు ప్రాంతాలు, చెరువుల కింద భూముల్లో సాగు కొనసాగుతోంది. దాదాపు 33ఏళ్ల తర్వాత అమలులోకి రానున్న కొత్త పట్టణ బృహత్ ప్రణాళికలోని ప్రతిపాదనలు పచ్చని పొలాల్లో చిచ్చుకు కారణమవుతున్నాయి.

రోడ్లు, పరిశ్రమలే..

ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌లో ప్రతిపాదించిన రోడ్లు, పరిశ్రమల జోన్లే కీలకంగా మారాయి. వీటి కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చాలా చోట్ల డీటీసీపీవాళ్లు శాటిలైట్ ఆధారంగా వీటిని ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బందిని సంప్రదిస్తే ఇలాంటి సమస్యలు చాలావరకు ఉండవన్న వాదన కూడా వస్తోంది. ప్రస్తుతం నిర్మల్‌లో కొత్త కలెక్టరేట్ మీదుగా మంచిర్యాల హైవే నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే పాత ఎన్‌హెచ్ 7కు లింక్ చేసే 100ఫీట్ల ప్రతిపాదిత రోడ్డు ఆందోళనకు కారణమవుతోంది. ఇప్పటికే రెడ్డి ఫంక్షన్‌హాల్ చౌరస్తా నుంచి మహాలక్ష్మీ ఆలయం వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. బంగల్‌చెరువు కట్ట మొదలు నుంచి కట్ట కింది భాగంలోని పొలాల మీదుగా విశ్వనాథ్‌పేట్‌లోని పాత ఎన్‌హెచ్ 7 వరకు వందఫీట్ల రోడ్డును డ్రాఫ్ట్‌లో ప్రతిపాదించారు. ఇదే స్థానిక రైతులు, భూయజమానుల్లో ఆందోళనకు కారణమవుతోంది. ఇక్కడ బంగల్‌చెరువు కట్టపై నుంచి ఇదివరకే విశ్వనాథ్‌పేట్ వరకు ఓ రోడ్డు ఉంది. దాన్ని వెడల్పు చేస్తే సరిపోతుందని వారు వాదిస్తున్నారు. పరిశ్రమలకు కేటాయించిన జోన్‌పైనా అభ్యంతరాలు వచ్చాయి. తల్వేద-మంజులాపూర్ మధ్యలో కొంతభాగం ఇండస్ట్రియల్‌కు ప్రతిపాదించడాన్నీ స్థానిక రైతులు వ్యతిరేకిస్తున్నారు.

పుష్కరకాలం లేటు..

1990లో చేసిన మాస్టర్‌ప్లానే ఇప్పటికీ మున్సిపాలిటీల్లో అమలవుతోంది. లెక్కప్రకారం 20–25ఏళ్లకోసారి కొత్త బృహత్ ప్రణాళికను అమలులోకి తీసుకురావాలి. ఈలెక్కన నిర్మల్‌లో 2011కు అటుఇటుగా అమలు చేయాల్సిన ప్రణాళికను ఏకంగా 12ఏళ్ల ఆలస్యంగా తీసుకువస్తున్నారు. పట్టణంలో ఏ రోడ్డు ఎంత ఉండాలి, ఏ వైపున పరిశ్రమలు, పార్కులు ఉండాలి. నివాసప్రాంతాలు ఎక్కడెక్కడ కేటాయించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, డంప్‌యార్డులు ఇలా పట్టణానికి ఓ 20–25ఏళ్ల వరకు ఇబ్బంది లేకుండా ఉండేలా డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) చూసుకుంటుంది. అందుకే ప్లాట్లు, వెంచర్లకు సంబంధించి డీటీసీపీ అనుమతి తప్పనిసరి అని చెబుతారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌పై వస్తున్న అభ్యంతరాలను డీటీసీపీ దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరుతామని స్థానిక అధికారులు చెబుతున్నారు.

భూముల్లో నుంచి వేయొద్దు



మాస్టర్‌ప్లాన్‌పై ముందుగా ఎలాంటి సంప్రదింపులు చేపట్టలేదు. మా భూముల్లో నుంచే వంద ఫీట్ల రోడ్డు వేస్తామనడం సమంజసం కాదు. ఇదివరకే ఉన్న రోడ్డును వెడల్పు చేయొచ్చు.
– వెంకటరమణ, నిర్మల్

పాతరోడ్డు అభివృద్ధి చేయొచ్చు



కొత్త మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మా పంటభూముల్లో నుంచి రోడ్డు వేస్తామన్న ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలి. ఇక్కడ గుంటల చొప్పున ఉన్న కాస్త భూములు కూడా రోడ్డు వేస్తే మొత్తానికి నష్టపోవాల్సి వస్తుంది. – తోట రవికుమార్, నిర్మల్

అభ్యంతరాలు పరిశీలిస్తారు

మాస్టర్‌ప్లాన్ ప్రస్తుతం డ్రాఫ్ట్ మాత్రమే ఇచ్చారు. దీనిపై 60రోజుల వరకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 10వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. మా వద్దకు వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలనూ డీటీసీపీకి పంపిస్తాం. ప్రస్తుతం ఉన్నది డ్రాఫ్ట్ మాత్రమే. రైతులు, స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే మాస్టర్‌ప్లాన్ ఫైనల్ చేస్తారు. – సుమలత, డీటీపీవో

విధి విధానాలపై ఉత్కంఠ

- జీవో 317 వ్యవహారంపై సందిగ్ధం
- బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఎలా?
- సీనియార్టీ జాబితా.. ప్రహసనమే..
- ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ
- నేడు మార్గదర్శకాలు వెలువడే ఛాన్స్

జిల్లాలో పోస్టులు, ఖాళీల వివరాలు

మంజూరైన పోస్టులు	2,958
ప్రస్తుతం ఉన్నవారు	2,434
ఖాళీలు	524
ప్రమోషన్‌కు అర్హులు	474
డీఎస్సీ ద్వారా భర్తీ	296



డీఈవో కార్యాలయం

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా విద్యాశాఖ అధికారులు విధివిధానాల రూపకల్పనలో బిజీ అయ్యారు. విధివిధానాలు ఎలా ఉండనున్నాయి? నిబంధనలు ఎవరికి వర్తించనున్నాయి? తదితర విషయాలపై ఉపాధ్యాయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. గతంలోలాగే ప్రమోషన్లు, బదిలీలు చేపడతారా?.. లేదా.. కొత్త నిబంధనలు తీసుకొస్తారా?.. అనే చర్చ జరుగుతోంది. 317 జీవో అమలు, కొత్త జిల్లాలకు క్యాడర్ స్ట్రెంత్ తదితర అంశాలపై ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

యాజమాన్యాలవారీగా ప్రమోషన్లు!

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు యాజమాన్యాల వారీగానే నిర్వహించనున్నట్లు సమాచారం. ఏకీకృత సర్వీస్ రూల్స్ వివాదం కోర్టులో ఉన్నందున లోకల్ బాడీ, గవర్నమెంట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను వేర్వేరుగా జిల్లాల వారీగా అధికారులు రూపొందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో 317 జీవో చుట్టే చర్చ సాగుతోంది. గతంలో ఉన్నట్లే విధివిధానాలు ఉంటాయా?.. ఇటీవల చేపట్టిన క్యాడర్ స్ట్రెంత్ బదిలీల్లో స్థానచలనం జరిగిన వారిపై ప్రభావం ఉంటుందా?.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సీనియార్టీ విషయంలో ఆందోళన

బదిలీల్లో భాగంగా సీనియార్టీ విషయంలో ఆందోళన చెందుతున్నారు. తమకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విజ్ఞప్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు భాషా పండితులు, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ ఉద్యోగోన్నతుల అంశం కోర్టులో ఉండగా ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందని ఎదురుచూస్తున్నారు. అందరితో పాటే తమకూ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సంక్రాంతి రోజు ఇద్దరు మంత్రులు, సంఘాల నాయకులతో జరిగిన చర్చల్లో తమ వాయిస్ వినిపించినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

నేడు మార్గదర్శకాలు

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల అంశంపై బుధవారం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశముంది. ఈ మార్గదర్శకాల ప్రకారమే అధికారులు సీనియార్టీ జాబితా, వేకెన్సీ జాబితా ప్రకటిస్తారు. ఇప్పటికే అధికారులు ఖాళీలను బట్టి ఓ అంచనాకు వచ్చారు. జిల్లావ్యాప్తంగా 169 మంది స్కూల్ అసిస్టెంట్లు, 59 పీజీ హెచ్‌ఎంలు, 35 పీడీలు, 211 మంది పండితులకు.. మొత్తంగా 474 మందికి ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉంది.

ప్రహసనంగా సీనియార్టీ జాబితా

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సీనియార్టీ జాబితా తయారు చేయడం అధికారులకు కత్తి మీద సామే కానుంది. సెకండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు పొందుతారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు జిల్లా వారీగా ప్రామాణికంగా తీసుకోగా.. హెచ్‌ఎంలు మాత్రం మల్టీజోన్ (ఉమ్మడి ఖమ్మం వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్) వారీగా ఉండనున్నాయి. ఎస్జీటీల విషయంలో డీఎస్సీలో వారు సాధించిన మెరిట్, రోస్టర్ విధానాలను ప్రమోషన్లలో ప్రామాణికంగా తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఆయా రిజర్వేషన్లను అనుసరించి 15, 7 శాతాలు జిల్లాలో భర్తీ అయ్యేలా విధివిధానాలు రూపొందించాలి. మంజూరు చేసిన పోస్టుల్లో 70% ప్రమోషన్లతో 30% డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. ఇక బదిలీల విషయానికొస్తే గ తంలో లాగానే ప్రస్తుతం పని చేస్తున్న చోట ఎ నిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారికి, ప్రధానోపాధ్యాయులకు మాత్రం ఐదేళ్లు ఒకే దగ్గర విధులు నిర్వహించిన వారికి తప్పనిసరి బదిలీ వర్తిస్తుంది.



గ్రామదేవతలకు బోనాలు

తానూరు: మండలంలోని తానూరు, ఎల్వి గ్రామాల్లో మంగళవారం గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. తానూరులో విఠలేశ్వరాలయం నుంచి మహాలక్ష్మీ ఆలయానికి గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, నృత్యాల మధ్య చేరుకున్నారు. మొక్కులు సమర్పించారు. ఎల్విలో బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య మహాలక్ష్మీ ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో రాగా ఆలయాల వద్ద సందడి నెలకొంది. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

యువతను ప్రోత్సహించడం అభినందనీయం



భైంసా సబ్ డివిజన్ పోలీసులతో మంత్రి, ఎస్పీ

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ముగిసిన బీపీసీఎల్ పోటీలు



భైంసా జట్టుకు ట్రోఫీ ఇస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

భైంసాటౌన్: యువతను ప్రోత్సహించేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్డి(బీ) బైపాస్‌రోడ్డులో ఐదురోజులుగా నిర్వహిస్తున్న బీపీసీఎల్ పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన ఎంతోమంది క్రీడాకారులున్నారని, ఇలాంటి పోటీలు వారికి ప్రోత్సాహకంగా ఉంటాయని చెప్పారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతోమంది దేశం గర్వించే స్థానంలో ఉన్నారని, జిల్లా యువత కూడా ఆ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. భైంసా సబ్ డివిజన్‌లో యువతను ప్రోత్సహించేలా ఇలాంటి పోటీలు ఏటా నిర్వహిస్తామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఇక్కడి యువత, ప్రజలతో మమేకమయ్యేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు ఏఎస్పీ కిరణ్‌ఖారె పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోటీలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం మంత్రి, ఎస్పీ సరదాగా కాసేపు క్రికెట్ ఆడి అలరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పీ కృష్ణ, టీఆర్‌ఎస్ నాయకులు రాజన్న, ఫారూక్ అహ్మద్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

బహుమతులు అందజేత

కుభీర్ మండలం బెల్‌గాం, భైంసాకు చెందిన వార్లిక్ హీరోస్ జట్లు సెమీఫైనల్‌లో గెలిచి మంగళవారం ఫైనల్‌లో తలపడ్డాయి. భైంసా జట్టు విజయం సాధించగా, బెల్‌గాం రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కిరణ్‌ఖారె ట్రోఫీతోపాటు రూ.21వేలు, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తరఫున రూ.10వేలు, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ తరఫున మరో రూ.10వేలు అందించారు. రన్నరప్‌గా నిలిచిన బెల్‌గాం జట్టుకు రూ.11వేలు అందజేశారు.

అమిత్ షా పర్యటన విజయవంతం చేయాలి

- ఎంపీ సోయం బాపూరావ్
- 28న ఉమ్మడి జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి రాక



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నాయకులతో మంగళవారం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా అమిత్‌షా ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించనున్నట్లు తెలిపారు. ముందుగా పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో పర్యటిస్తారని వెల్లడించారు. అక్కడ పార్టీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారన్నారు. అలాగే ఆదివాసీల ఆరాధ్యుడైన కుమురంభీం జన్మస్థలమైన జోడేఘాట్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అధినాయకత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. ఇందులో భాగంగా హోంమంత్రి ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రవాస్‌యాత్రను ప్రారంభిస్తుండడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, కోకన్వీనర్ మయూర్ చంద్ర, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు రాథోడ్ రమేశ్, బోయర్ విజయ్, అంకత్ రమేశ్, సుహాసినిరెడ్డి, వేణుగోపాల్, నగేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: గ్రూప్–2, 3, 4 పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు జిల్లాలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫిబ్రవరి 6నుంచి మే వరకు మూడు నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వీ రాజేశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 100 సీట్లు ఉండగా 33.33 శాతం మహిళలు, ఐదుశాతం దివ్యాంగులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31వరకు www.tsstudycircle.co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏదైనా జనరల్, ప్రొఫెషనల్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసి, కుటుంబ ఆదాయం రూ.3లక్షలకు మించని వారు అర్హులని పేర్కొన్నారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులకు ప్రవేశం కల్పిస్తారని, పూర్తి వివరాలకు 9493020926 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కంటివెలుగుకు లైవ్ లొకేషన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఉదయం 8–45 లోపు హాజరు పూర్తి చేసుకుని అధికారులు కంటివెలుగు శిబిరాలు ప్రారంభించాలని కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కంటివెలుగు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 19న జిల్లాలో ఉదయం 9 గంటలకు శిబిరాలు ప్రారంభమవుతున్నందున 18న ఉదయం 8గంటలకల్లా కేటాయించిన గ్రామాలకు చేరుకోవాలన్నారు. శిబిరాల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అవసరమైన వారికి 15రోజుల్లో ఆశ కార్యకర్తల ద్వారా కళ్లద్దాలు ఇంటికే పంపించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులందరినీ కంటి వెలుగులో భాగస్వాములను చేసినట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రతిరోజూ ఐదు నుంచి ఆరు శిబిరాలు తనిఖీ చేస్తారని, మండల స్పెషలాఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. శిబిరాలకు వచ్చేవారు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ రెండు గంటలకోసారి రిపోర్ట్ సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ విశ్వ విద్యాలయం ద్వారా బుధవారం జరగాల్సిన పరీక్ష అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్‌ కంట్రోలర్‌ నరేందర్‌ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 8న నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

డిగ్రీలో పది మంది డిబార్‌

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ సెమిస్టర్‌–3,5 పరీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లా పరిధిలో పది మంది విద్యార్థులు డిబార్‌ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్‌ కంట్రోలర్‌ నరేందర్‌ తెలిపారు. భైంసాలోని గోకుల్‌దాస్‌ పురుషోత్తందాస్‌ లడ్డ డిగ్రీ కళాశాలలో నలుగురు, నిర్మల్‌లోని నందన డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు చొప్పున డిబారైనట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన ద్విచక్రవాహనం



సంఘటన స్థలంలో క్షతగాత్రుడు గజానంద్‌

బోథ్‌: మండలంలోని కోట(కె) గ్రామానికి చెందిన గజానంద్‌ మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని తన బంధువుల ఇంటికి వెళ్లిన గజానంద్‌ తిరుగు ప్రయాణంలో నాగుగూడ వద్ద బైక్‌ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. గాయాలపాలైన గజానంద్‌ను స్థానికులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్‌: రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన 317 జీవో ప్రకారం బదిలీలు అయిన ఉపాధ్యాయుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాకే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్‌ గణేశ్‌, టీపీటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి వెడ్మా శ్యాంరావ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుక అంటూ బదిలీలు, పదోన్నతులు చేపట్టడం సరికాదన్నారు. 317 జీవో ప్రకారం ఇతర జిల్లాలకు బదిలీలు అయిన వారికి స్థానికత వర్తించిన సీనియార్టీ ప్రకారం అన్యాయం జరుగుతుందన్నారు. బదిలీలు అయిన ఉపాధ్యాయుల సర్వీసును పరిగణలోకి తీసుకొని బదిలీలు, పదోన్నతలు చేపట్టాలన్నారు. సమావేశంలో టీటీఎఫ్‌, టీపీటీఎఫ్‌ సంఘాల నాయకులు జాదవ్‌ రవీంధర్‌, జాదవ్‌ సురేశ్‌, సదానంద్‌, ఇందాల్‌సింగ్‌, విఠల్‌, రవీందర్‌, కైలాస్‌ ఉన్నారు.

నాగోబా జాతర వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు
- తాగునీరు, పారిశుధ్యం లోపించకుండా చూడాలి
- నాగోబా జాతర సమీక్షా సమావేశంలో కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌



కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభం కానున్న కేస్లాపూర్‌ నాగోబా జాతరను ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డితో కలిసి మండలంలోని కేస్లాపూర్‌ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో దర్బార్‌హాల్‌లో సమావేశమయ్యారు. శాఖల వారీగా ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కోవిడ్‌తో రెండు సంవత్సరాల తరువాత భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. ఈ నెల 24న నిర్వహించే దర్బార్‌ సమావేశానికి గిరిజన సంక్షేమశాఖ, దేవాదాయశాఖ మంత్రులు రాథోడ్‌ సత్యవతి, ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని వివరించారు. జాతర ముగింపు వరకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నలుమూలలతో పాటు మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలని చెప్పారు. జాతరలో ప్రతీ ఒక్కరు కోవిడ్‌ నిబంధనలు పాటించేలా చూడాలని తెలిపారు. బెల్ట్‌ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, ఆర్‌డీవో కదం సురేష్‌, ఏఎస్పీ హర్షవర్ధన్‌, డీడీ దిలీప్‌కుమార్‌, ఆలయ ఈవో రాజమౌళి, సర్పంచ్‌ మెస్రం రేణుకనాగ్‌నాథ్‌, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం తుకారం, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌, ఏఎస్‌డీ కృష్ణయ్య, అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌



మెస్రం వంశీయులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

ఆర్టీసీలో రాజకీయ కోణం

- గత ఆర్‌ఎం బదిలీలో ఉమ్మడి జిల్లా నేతల ఒత్తిడి
- పలువురు డ్రైవర్లు, కండక్టర్ల బదిలీ ప్రక్రియతో గుర్రు
- డ్యూటీలు వేసే క్రమంలో ఉద్యోగుల అలక



గతంలో ఆర్‌ఎంగా పనిచేసిన సుధా పరిమళ

సాక్షి, ఆదిలాబాద్‌: ఇదివరకు ఆదిలాబాద్‌ ఆర్టీసీ ఆర్‌ఎంగా వ్యవహరించి సుధా పరిమళ బదిలీపై వెళ్లి నెలరోజుల పైబడింది. ఈ ట్రాన్స్‌ఫర్‌ సంస్థగతంగా జరిగిందా.. లేనిపక్షంలో ఇందులో ఏదైన కోణం ఉందా అనే అంశం అప్పట్లోనే చర్చకు వచ్చింది. ఇందులో రాజకీయ కోణం ఉందని ఆలస్యంగా వెలుగులోకి వస్తుంది. కేవలం ఎనిమిది నెలల పాటు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఆమెను వరంగల్‌ జోనల్‌ స్టాఫ్‌ ట్రెనింగ్‌ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేయడంపై సంస్థలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విధుల పట్ల నిక్కచ్చిగా వ్యవహరించే ఆమెను కళాశాల ప్రిన్సిపల్‌ పాత్రకు పరిమితం చేయడమే బదిలీ వెనుక ఏదో జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చర్చనీయం..

సాధారణంగా ప్రభుత్వంలోని వివిధ శాఖల పరంగా తమ పనులు సవ్యంగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు తమకు అనువుగా ఉండే అధికారులను నియమించుకోవడం సర్వసాధారణం. అయితే ఆర్టీసీ పరంగా చూస్తే దీంట్లో రాజకీయ ప్రమేయం స్వల్పంగా ఉంటుంది. డ్రైవర్లు, కండక్టర్లు బదిలీల పరంగా ఇదివరకు తమ యూనియన్‌ సంఘాల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం సంఘాల పాత్ర లేకపోవడంతో ప్రజాప్రతినిధుల ద్వారా రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి ఇలాంటివి చేపట్టేందుకు వెనుకాడటం లేదు.

బదిలీల ప్రక్రియతోనే..

ఆర్టీసీ ఆదిలాబాద్‌ రీజినల్‌ మేనేజర్‌గా సుధా పరిమళ గతేడాది మార్చి 24న బాధ్యతలు స్వీకరించి డిసెంబర్‌ 5 వరకు పనిచేశారు. ఆమె స్థానంలో పదోన్నతిపై జానిరెడ్డిని ఆదిలాబాద్‌ ఆర్‌ఎంగా నియమించారు. రీజియన్‌ పరిధిలోకి మంచిర్యాల, ఆదిలాబాద్‌, భైంసా, నిర్మల్‌, ఆసిఫాబాద్‌, ఉట్నూర్‌ వస్తాయి. కాగా సూపర్‌వైజర్లుగా, కంట్రోలర్‌గా విధులు నిర్వర్తించే సీనియర్‌ ఉద్యోగులను దూర ప్రాంతాల్లో డ్యూటీ వేయడంతో సతమతం అయినట్లు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా ఒక డిపో నుంచి మరో డిపోకు కండక్టర్లను ఆమె బదిలీ చేశారని చెప్పుకుంటున్నారు. దీంతో మరో డిపోకు వెళ్లడం ఇష్టంలేని పలువురు ఇటు నిర్మల్‌ అటు మంచిర్యాలలో బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంలో ఆ నేతలు ఆర్‌ఎంతో మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతోనే వారు ఆమె బదిలీ విషయంలో రాష్ట్రస్థాయిలో గట్టిగా ప్రయత్నాలు చేసి సక్సెస్‌ అయినట్లు తెలుస్తోంది.

ముగిసిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు



బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

తాంసి: భీంపూర్‌ మండలంలోని మార్కగూడ గ్రామంలో రాంజీగొండు యువజన సంఘం ఆధ్వర్యంలో మడావి రాజు స్మారకార్థం నిర్వహించిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలలో జిల్లాలోని పలు గ్రామాల జట్లతో పాటు మహారాష్ట్రకు చెందిన 120 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్‌ మ్యాచ్‌లో మహారాష్ట్రకు చెందిన సాలేగూడ, జవార్ల గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన పోటీలో జవార్ల జట్టుపై సాలేగూడ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించింది. గెలుపొందిన జట్టుకు యూత్‌ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.21,000 (గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్‌) చేతుల మీదుగా, రెండో బహుమతి జవార్ల జట్టుకు రూ.15వేలు (గామపెద్ద త్రయంబక్‌), మూడో బహుమతి చింతగూడ జట్టుకు రూ.10వేలు (గ్రామస్తుడు రాంప్రభు), నాల్గో బహుమతి మార్కగూడ జట్టుకు రూ.7వేలు(మడావి లింబాజీ భీంపూర్‌ సర్పంచ్‌) చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌ మడావి సునీత, యువజన సంఘం సభ్యులు నాగోరావు, వంశీ, సంతోష్‌, నాయకులు పాండ్‌రంగ్‌, పురుషోత్తం పాల్గొన్నారు.



జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు

సందడిగా ఖందేవ్‌ జాతర

- భక్తుల ప్రత్యేక పూజలు
- భారీగా తరలివస్తున్న ప్రజలు



జాతరలో ఏర్పాటు చేసిన రంగులరాట్నాలు

నార్నూర్‌: తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖందేవ్‌ జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈ నెల 06న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాపూజతో ప్రారంభమైన జాతర ఈ నెల 20 వరకు కొనసాగనుంది. మంగళవారం పాఠశాలలకు చివరి సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఖందేవ్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యువకులు కబడ్డీ, క్రికెట్‌, వాలీబాల్‌ క్రీడా పోటీలను నిర్వహించారు. రంగులరాట్నాలు, చిన్న పిల్లల ఆట బొమ్మలు రావడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా జాతరలో ఉల్లాసంగా గడిపారు. గత వందేళ్లుగా జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన గిరిజనులు ఆడ పిల్లల పెళ్లికి సంబంధించిన సామగ్రిని జాతరలో కొనుగోలు చేస్తారు. బంధువులతో కలిసి వారి సంప్రదాయం ప్రకారం గాజులు చేతులకు వేసుకుని ప్రేమను చూపుతారు. జాతరకు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

'రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం'

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌



బ్యాంక్‌ అధికారులతో మాట్లాడుతున్న శంకర్‌

ఆదిలాబాద్‌: బ్యాంక్‌ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌ అన్నారు. మంగళవారం బాధిత రైతులతో కలిసి జిల్లా కేంద్రంలోని బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పలు బ్యాంక్‌ అధికారులు అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఖాతాల్లో వచ్చిన డబ్బులను క్రాప్‌ లోన్‌ పేరిట జమ చేసుకోవడం తగదన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే పంటలు సరిగ్గా పండక నష్టాల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో బ్యాంకర్లు మానవతాదృక్పతంతో వ్యవహరించాల్సింది పోయి బలవంతపు వసూళ్లకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయగా, ఆ డబ్బులను సైతం రైతులు తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు బ్యాంక్‌ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు

- ఎంపీ సోయం బాపూరావు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్‌: మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని టెలికాం అడ్వైజరీ కమిటీ చైర్మన్‌, ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెలికాం అడ్వైజరీ కమిటీ (టీఏసీ) మొదటి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నెట్‌వర్క్‌ లేని కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం సంబంధిత ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ కల్పించేందుకు పార్లమెంట్‌లో బిల్లును సైతం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సొంత గ్రామమైన ఘనపూర్‌లో సైతం నెట్‌వర్క్‌ లేకపోవడం ఈ పరిస్థితికి నిదర్శనమని తెలిపారు. అటవీశాఖ సంబంధ అనుమతుల విషయంలో ఉన్న ఇబ్బందులను కేంద్ర అటవీ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్‌ సమావేశాల్లో సైతం ఈ విషయాన్ని ప్రస్తావిస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలోని 160 గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న టవర్ల విషయంలో జిల్లాల వారీగా సైతం త్వరలోనే సమీక్షిస్తానన్నారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్‌ నెట్‌వర్క్‌ సేవలు అత్యవసరమయ్యాయని, ఈ నేపథ్యంలో మారుమూల ప్రాంతంలో ఉంటున్న గిరిజనుల అవస్థలను దూరం చేసేందుకు బీఎస్‌ఎన్‌ఎల్‌ అధికారులు సమష్టిగా కృషి చేయాలని, ఇందుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం టవర్ల ఏర్పాటుకు అనుమతించిందని, అటవీ ప్రాంతాల్లో స్థల సేకరణ విషయంలో ఇబ్బందులు వస్తున్నాయని పీజీఎం కేవీఎస్‌రావ్‌ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఏజీఎం దేవిదాస్‌, డీజీఎం జగ్గరాం, ఐఎఫ్‌ఏ విజయ్‌ కుమార్‌, జేటీవో రవీందర్‌, శ్రీధర్‌, సీతరాం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సెల్ఫీ విత్‌ రంగోళి



విజేతలను ప్రకటిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్‌: కేఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సెల్ఫీ విత్‌ రంగోళి పోటీలకు స్పందన లభించింది. బీజేపీ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి క్యాంప్‌ ఆఫీస్‌లో నిర్వహించిన లక్కీ డ్రా పోటీల విజేతలను ఎంపీ సోయం బాపూరావు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్‌ శ్రీనివాస్‌, అసెంబ్లీ ప్రభారీ బద్దం లింగారెడ్డి, పార్లమెంటరీ కన్వీనర్‌ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌, కంది శ్రీనివాస రెడ్డి, గడ్డం నందిరెడ్డి డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఎంపీ మాట్లాడుతూ సంక్రాంతి పండగ ప్రాశస్త్యాన్ని తెలిపే ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పోటీలో మొదటి బహుమతి 1 గ్రాము బంగారు నాణెం విజేతగా జైనథ్‌కు చెందిన గంగామణి, ఇరవై మంది వెండి నాణేల విజేతలు శ్రీజ, పూజ, లండే సంధ్య, శృతి , శ్రీజ, శరణ్య, సాయి సుధా, సోని, సౌజన్య, కీర్తి, వినూత్న, మైథిలి, శైలజ, హారిక, సోని, శ్రావ్య, సుజాత, స్వరూప, స్వరూప, స్ఫూర్తి ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దుర్గనగర్‌ శివారు ప్రాంతంలో అదే కాలనీకి చెందిన తుర్పటి ఎర్రన్న (60) ఉరేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఎర్రన్న గత కొన్ని నెలల నుంచి కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకును ఢీ కొట్టిన కారు

- ఒకరు దుర్మరణం



మల్లయ్య మృతదేహం పరిశీలిస్తున్న ఎస్సై

జన్నారం: అతివేగం, అజాగ్రత్త ఒకరి ప్రాణాన్ని బలికొంది. వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. ఎస్సై తానాజీ నాయక్‌ వివరాల ప్రకారం... మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం మల్లయ్య (56) సోమవారం సాయంత్రం 9గంటల ప్రాంతంలో మందపెల్లి గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందన్‌పల్లి నుంచి జన్నారం వైపు వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. మల్లయ్య తీవ్రంగా గాయపడగా కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మల్లయ్యకు భార్య గంగవ్వ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- రూ.5లక్షల ఆస్తినష్టం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్‌: ప్రమాదవశాత్తు ఇంటి కరెంట్‌ మీటర్‌లో నుంచి మంటలు వ్యాపించి మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన జలంపల్లి రామయ్య అనే రైతు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. రామయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రామయ్య, ఆయన భార్య లత ఇద్దరూ పొలం పనుల నిమిత్తం బయటకు వెళ్లగా వారి పిల్లలు సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లోని కరెంట్‌ మీటర్‌లో మంటలు చెలరేగడం అవి కాస్త పత్తిపై పడటంతో మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కానరాలేదు. ఎన్టీపీపీ ఫైర్‌ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లోని కర్ర, విలువైన వస్తువులు, 50క్వింటాళ్ల పత్తి కలి పోయింది. రూ.5లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు రామయ్య వాపోయాడు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్‌ మోహన్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ, సర్పంచ్‌ లింగారెడ్డి, ట్రాన్స్‌కో డిపార్టుమెంట్‌ సిబ్బంది పరిశీలించారు.



జన్నారం డివిజన్‌లో పక్షుల కోలాహలం



కవ్వాల్‌ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో పక్షులు కోలాహలం చేస్తున్నాయి. శీతాకాలం కావడంతో సుదూర ప్రాంతాల పక్షులు వలస వచ్చి ఇక్కడ వాటి సంతతిని పెంచుకుంటాయి. ఈ క్రమంలో జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మ కుంట, బైసన్‌ కుంట ప్రాంతాలలో పక్షుల కోలాహలం కనిపించాయి. ఆసియా దేశాలకు సంబంధించిన ఆసియన్‌ ఓపెన్‌ బిల్‌ స్ట్రోక్‌, నార్తెన్‌ పింటెల్‌ పక్షులు ఆయా ప్రాంతాలలో కనిపించాయి. –జన్నారం





